మహిళలు స్వయం ఉపాధితో రాణించాలి



ధ్రువపత్రాలను అందజేసిన మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

మణికొండ: ఇంట్లో ఉంటున్న మహిళలకు తమకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధితో ఆర్థికంగా రాణించాలని నార్సింగి మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట్‌లో గత నెల రోజులుగా సయోధ్య హోం ఫర్ ఉమెన్ నీడ్ స్వచ్ఛంద సంస్థ, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో కోకాపేట్ కమ్యూనిటీహాల్‌లో 30 మంది మహిళలకు వంటలపై ఉచిత శిక్షణను అందించారు. మంగళవారం నిర్వహించిన ముగింపు, ధ్రువపత్రాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఇంట్లోనే ఉండి రుచికరంగా వంటలను తయారుచేసి ఆన్‌లైన్ విక్రయించుకునే అవకాశం స్థానిక మహిళలకు ఉందన్నారు. ఈ విషయాన్ని గుర్తించి సంస్థల ప్రతినిధులు వారికి మరింత తర్ఫీదు నిచ్చి వంటలు చేయటం, మార్కెటింగ్ నిపుణను నేర్పడం మంచి పరిణామన్నారు. స్థానిక కౌన్సిలర్ శివారెడ్డి, మెప్మా ఇన్‌చార్జి స్వామి, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ అధికారి సాయి శ్రీనివాస్, సయోధ్య కార్యదర్శి మృధులతో పాటు మహిళలు పాల్గొన్నారు.

జయంత్యుత్సవాలకు ఆహ్వానం



ఆహ్వానపత్రికను అందజేస్తున్న కమిటీ ప్రతినిధులు

రాజేంద్రనగర్: చిన్న పిల్లల వైద్యుడు, రామయ్య ఆస్పత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ అమరేందర్, యూనివర్సిటీ హెడ్ అండ్ ప్రొఫెసర్ డాక్టర్ గోవర్ధన్‌లను మంగళవారం రాజేంద్రనగర్ సర్కిల్ మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కలిసి బాబు జగ్జీవన్‌రామ్ జయంత్యుత్సవాలకు హాజరు కావాలని ఆహ్వానపత్రాన్ని అందజేశారు. ఉత్సవ కమిటీ అధ్యక్షులు పచ్చ నర్సింగ్‌రావు, జీవన్‌దాస్, పోతురాజు యాదయ్య, ఎడ్లకాడి సూర్యం, పంబాల రాజు, బచ్చల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమగ్ర వికాసానికి కృషి చేయాలి



ఉత్కర్ష్ ఉత్సవాలను ప్రారంభించిన సౌందర్య

మణికొండ: విద్యార్థుల సమగ్ర వికాసానికి సిలబస్‌తో పాటు ఆట, పాటలు అవసరమని, వాటిని సంపూర్ణంగా నేర్పించి వారి వికాసానికి పాఠశాలలు కృషి చేయాలని భారత హాకీ టీమ్ కోచ్ సౌందర్య అన్నారు. నార్సింగి, అలకాపూర్ టౌన్‌షిప్‌లలో ఉన్న గౌతమ్ మోడల్ స్కూల్ బ్రాంచ్‌లు సంయుక్తంగా నిర్వహించిన ఉత్కర్ష్ (స్పోర్ట్స్, గ్రాడ్యుయేషన్ డే) కార్యక్రమంలో ఆమె మంగళవారం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు శారీరక, మానసిక వికాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. బాల్యంలో ఆటలు చాలా ముఖ్యమని, వాటిని ఆడించే పాఠశాలల్లోనే తల్లితండ్రులు తమ పిల్లలను చేర్పించాలన్నారు. క్రీడలతో విద్యార్థుల్లో చురుకుదనంతో పాటు క్రమశిక్షణ, పోటీతత్వం, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గౌతమ్ విద్యా సంస్థల అధినేత ఎం, వెంకటనారాయణ, కార్యదర్శి ఆర్.కే రెడ్డి, డైరెక్టర్లు శ్రీకాంత్, భరత్, బిజినెస్ హెడ్ కె. భరద్వాజ్, ప్రిన్సిపాల్స్ సునీత, అనూష పాల్గొన్నారు.

సీబీఐటీ ఫ్యాకల్టీకి అవార్డు



సహాయ ప్రొఫెసర్లను అభినందించిన ప్రిన్సిపాల్ నరసింహులు

మణికొండ: ఒడిశా రాష్ట్రంలోని హిరాకుడ్ డ్యామ్‌పై డ్యాం బ్రీచ్ పారామీటర్స్, అస్థిరమైన ప్రవాహ నమూనాపై కేస్ స్టడీ పరిశోధనకు సీబీఐటీ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ సహాయ ప్రొఫెసర్లు డాక్టర్ కమలిని దేవి, డాక్టర్ జ్ఞాన రంజన్ ఖుంటియాలకు నందనాదన్ దాస్ అవార్డు దక్కిందని ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు తెలిపారు. మంగళవారం కళాశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిరాకుడ్ డ్యామ్ పూన కేస్ స్టడీస్‌లో భాగంగా పద్ధతి పని సైద్ధాంతిక జ్ఞానాన్ని వాస్తవ ప్రపంచ వినియోగంతో మిళితం చేస్తుందన్నారు. ఇది ప్రపంచ వ్యాప్తంగా ఆనకట్ట భద్రత, నిర్వహణ పద్ధతుల రంగంలో జ్ఞానాన్ని పెంపొందించేందుకు దోహదం చేస్తుందన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ కె. జగన్నాథరావు, అధ్యాపకులు జీఎన్‌ఆర్ ప్రసాద్ అవార్డు గ్రహీతలు పాల్గొన్నారు.

బీజేపీ కోర్ కమిటీ సమావేశం



రాజేంద్రనగర్ డివిజన్ ఇన్‌చార్జి డాక్టర్ ప్రేమ్‌రాజ్‌యాదవ్ తదితరులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ కోర్ కమిటీ సమావేశాన్ని డివిజన్ అధ్యక్షులు బాబురావు అధ్యక్షతన జరిగింది. మంగళవారం జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాజేంద్రనగర్ డివిజన్ ఇన్‌చార్జి డాక్టర్ ప్రేమ్‌రాజ్‌యాదవ్, రాష్ట్ర బీజేపీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బీజేపీ డివిజన్ కమిటీ సమావేశాలు, వివిధ మోర్చాల కమిటీ సమావేశాలు నిర్వహించాలన్నారు. బూత్ కమిటీల పరిశీలన చేసి లిస్టులు తీసుకోవాలన్నారు. బూత్‌ల వారీగా లాభార్థి సంపర్క్ అభియాన్ జరపాలని, ప్రతిబూత్‌లో కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ లిస్టు వెరిఫికేషన్, బీఎల్ఏ 1,2, లిస్టు చేయాలన్నారు. వై.శ్రీధర్, బొక్క బాల్‌రెడ్డి, కోరని సదానంద్, సోల్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, హరికిషన్, రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి పసుపుల సందీప్‌ముదిరాజ్ తదితరులున్నారు.

పార్టీ మారిన వారికి బుద్ధి చెప్పాలి

- మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి
- నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తామన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సబితారెడ్డి

మణికొండ: పార్టీ అధికారంలో ఉన్నప్పుడు లబ్ధి పొంది కష్టాల్లో ఉన్నప్పుడు పార్టీ మారిన వారికి వచ్చే ఎంపీ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మంగళవారం నార్సింగి ఓం కన్వెన్షన్‌లో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన రాజేంద్రనగర్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కోసం పార్టీ పెట్టి, పోరాటం చేయటంతో పాటు జిల్లా పరిషత్ చైర్మన్, ఎమ్మెల్సీగా పనిచేసి జిల్లా ప్రజలకు సుపరిచితుడైన కాసాని జ్ఞానేశ్వర్‌ను ఎంపీగా గెలిపించి మాజీ సీఎం కేసీఆర్‌కు బహుమతిగా ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి నాయకుడు, కార్యకర్తపై ఉందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే హైదరాబాద్, రంగారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

జిల్లాలో లింక్‌రోడ్లు, ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, సైకిల్‌ట్రాక్, ఔటర్ ఎంట్రీలు, తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా లాంటి ఎన్నో పనులు జరిగాయని, అందుకే అన్ని ఎమ్మెల్యే స్థానాల్లో బీఆర్‌ఎస్ పార్టీనే గెలిచిందన్నారు.

కేసీఆర్ నిషానా తీయటం సాధ్యం కాదు...

రాష్ట్రంలో కేసీఆర్ నిషానా లేకుండా చేస్తానని ప్రగల్భాలు పలుకుతున్న ప్రభుత్వం రాష్ట్రం సాధించిందే ఆయననే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లాంటి పథకాలు తొలగించి చూడాలని మాజీమంత్రి సవాల్ విసిరారు. 96 కులాలను ఒక్కతాటిపైకి తెచ్చి వారి హక్కుల కోసం పోరాటం చేసిన వ్యక్తి జ్ఞానేశ్వర్ అని, ఆయనను గెలిపిస్తే బడుగుల గొంతు పార్లమెంట్‌లో వినిపిస్తుందన్నారు.

గ్రౌండ్ రియాల్టీ తెలిసిన వ్యక్తి కేసీఆర్...

గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై పూర్తి స్థాయి గ్రౌండ్ రియాల్టీ తెలిసిన వ్యక్తిగా దశాబ్దకాలం రాష్ట్రాన్ని మాజీ సీఎం బంగారు తెలంగాణగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారని బీఆర్‌ఎస్ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. 24 గంటల నిరంతర విద్యుత్‌తో రైతులతో పాటు పారిశ్రామిక రంగాలు అభివృద్ధి చెందాయన్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎమ్మెల్సీలు వాణిదేవి, ఎగ్గే మల్లేషం, దయానంద్ గుప్తా, నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ డి.రేఖాయాదగిరి, శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మామహేందర్‌రెడ్డి, మున్సిపాలిటీలు, డివిజన్‌ల పార్టీ అధ్యక్షులు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీలో డ్రామాలొద్దు..

మణికొండ: పార్టీలో ఉండాలనుకునే వారు ఉండొచ్చు.. పోవాలనుకునే వారు పోవచ్చని.. తెరచాటు డ్రామాలు వద్దని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ స్పష్టం చేశారు. మంగళవారం నార్సింగి ఓం కన్వెన్షన్‌లో ఆయన అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ ప్రాంత ప్రజలకు తెలియని రంజిత్‌రెడ్డిని గత ఎంపీ ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ఆదేశంతో గెలిపించామని, ఇప్పుడు మన జిల్లా వాసి, ప్రజలకు జిల్లా పరిషత్ చైర్మన్, ఎమ్మెల్సీగా సేవలు చేసిన వ్యక్తిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. గత ఎమ్మెల్యే ఎన్నికల్లోనూ తనను ఓడించేందుకు కొందరు ప్రయత్నించారని, నియోజకవర్గ ప్రజలు, మైనార్టీలు తన వెంట నిలిచి భారీ మెజార్టీతో గెలిపించుకున్నారన్నారు. ఇదే తరహాలో ఎంపీ ఎన్నికల్లోనూ జ్ఞానేశ్వర్‌ను గెలిపించి పార్లమెంట్‌లో మన గొంతు వినిపిద్దామని పిలుపునిచ్చారు.

ప్రజల మనిషిని గెలిపించుకోవాలి...

జిల్లా వాసిగా ప్రజలకు సేవలు చేసిన, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన కాసాని జ్ఞానేశ్వర్‌ను ఎంపీగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎమ్మెల్సీలు వాణిదేవి, యెగ్గె మల్లేషం, బి. దయానంద్‌గుప్తాలు అన్నారు. రాజేంద్రనగర్ బీఆర్‌ఎస్‌పార్టీ కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, సీనియర్ నాయకులు గణేష్‌గుప్తా, ఆర్. నర్సింహ, పి. చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రారెడ్డి, కె.సువాన్‌రెడ్డి, ధర్మారెడ్డి, రమేష్‌ముదిరాజ్, కె. రామకృష్ణారెడ్డి, లతాగౌడ్, లక్ష్మీశ్రీ, సతీష్, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బండ్లగూడ నాయకులు గైర్హాజరు..

నార్సింగిలో మంగళవారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశానికి బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన పార్టీ నాయకులు గైర్హాజరయ్యారు. మాజీ మేయర్ మహేందర్‌గౌడ్, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు సురేష్‌లతో పాటు మరో ముగ్గురు కార్పొరేటర్లు ఇప్పటికే పార్టీ మారారు. డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉన్న 15 మంది కార్పొరేటర్లలో ఇద్దరు, ముగ్గురు ఇతర పార్టీలకు చెందిన వారు ఉన్నా.. మిగతా కార్పొరేటర్లు ఇప్పటి వరకు బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతున్నారు. మంగళవారం జరిగిన సమావేశానికి వారంతా డుమ్మా కొట్టడంతో వారు పార్టీలో కొనసాగే విషయం తేటతెల్లం అయినట్టేనని నాయకులు, కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.



హాజరైన నాయకులు, కార్యకర్తలు

సంగమేశ్వర ఆలయాన్ని పునర్నిర్మించాలి



ఆందోళన చేస్తున్న బీజేపీ నేతలు

శంషాబాద్: పట్టణంలోని బాలాజీ వెంచర్ సమీపంలోని సంగమేశ్వరాలయాన్ని పునర్నిర్మించాలని బీజేపీ నేతలు మంగళవారం ఆందోళన చేపట్టారు. సర్వే నంబరు 620/1లో ఉన్న ఆలయాన్ని రెండేళ్ల క్రితం స్థిరాస్తి వ్యాపారులు తొలగించినా ఇప్పటి వరకు దానిని దేవాదాయశాఖ పట్టించుకోలేదన్నారు. ఎంతో పురాతనమైన చరిత్ర కలిగిన ఆలయం పునర్నిర్మాణం విషయంలో దేవాదాయశాఖ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమని బీజేపీ నేతలు జితేందర్, మహేందర్, మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆలయాన్ని తొలగించిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు కూడా తీసుకోలేదని ఆరోపించారు. ఆలయాన్ని పునర్నిర్మించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

మణికొండ: పార్కులు, కమ్యూనిటీ హాల్, కమర్షియల్, ఖాళీ స్థలాల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలపై తగిన చర్యలు తీసుకోవాలని మణికొండ మున్సిపాలిటీ, 7వ వార్డు కౌన్సిలర్ పద్మారావు మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి, హెచ్‌ఎండీఏ కమిషనర్‌ను కోరారు. మణికొండ మున్సిపాలిటీ, నెక్నాంపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 22/పి, 23,24,25,26లలో వచ్చిన వేంకటేశ్వర కాలనీ లేఅవుట్‌లోని ప్రజల అవసరాలకు కోసం వదలిన స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయని, వాటిని సకాలంలో స్పందించి అడ్డుకోవాలని ఆయన కోరారు. మంగళవారం ఆయన ఈ మేరకు వినతిపత్రం హెచ్‌ఎండీఏ కార్యాలయంలో అందజేశారు. ఇటీవలే కాలనీ ప్రజలు ఆందోళన నిర్వహించారని, ఇకనైనా స్పందించి తగిన తీసుకోవాలని లేదంటే భవిష్యత్తులో మున్సిపల్, హెచ్‌ఎండీఏ కార్యాలయాల ఎదుట ధర్నా చేపడతామని హెచ్చరించారు.

‘పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ క్లీన్‌స్వీప్’

బండ్లగూడ: వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో క్లీన్‌స్వీప్ చేయడం ఖాయమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ కో–ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పార్లమెంటు విస్తృతస్థాయి సమావేశం జూబ్లీహిల్స్ ఎంపీ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి ఏ, బి – బ్లాక్, డివిజన్ అధ్యక్షులతో కలిసి పాల్గొన్నారు. పార్టీ కోసం అహర్నిశలు పనిచేస్తున్న తనకు తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ కో– ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్‌గా నియమించిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీకోసం కష్టపడి చేస్తూ.. అందరినీ కలుపుకుని ముందుకు వెళ్తానన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్

సీఎంను కలిసిన రాష్ట్ర వడ్డెర సంఘం ఉపాధ్యక్షుడు..

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంఘం ఉపాధ్యక్షుడిగా ఆంజనేయులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. వడ్డెరుల అభివృద్ధి, సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందేలా చూస్తానని, తనపై నమ్మకంతో వడ్డెర సంఘం ఉపాధ్యక్షుడిగా నియమించడం ఆనందంగా ఉందన్నారు.

భారీ మెజార్టీని అందించే బాధ్యత మీదే..

శంషాబాద్: చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీని అందించే దిశగా పనిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి శంషాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ నేతలకు సూచించారు. చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డితో కలిసి నిర్వహించిన పార్టీ నేతల సమావేశంలో మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్‌యాదవ్ సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శంషాబాద్ కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న గ్యారంటీలను ప్రజలకు వివరించాలని సూచించారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు తదితరులున్నారు.



సీఎంతో చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, సంజయ్‌యాదవ్



సీఎం రేవంత్‌తో తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంఘం ఉపాధ్యక్షుడు ఆంజనేయులు

ప్రజా సమస్యలు పరిష్కరించాలని వినతి

బండ్లగూడ: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుని శాశ్వత పరిష్కారాలు చూపించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 10వ డివిజన్ కార్పొరేటర్ ప్రశాంత్‌నాయక్ కోరారు. ఈ మేరకు మంగళవారం కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్రను కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎక్సైజ్ అకాడమీ నుంచి కిస్మత్‌పూర్ వివేకానంద విగ్రహం వరకు చేపట్టిన బీటీ రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. రోడ్డుపై మ్యాన్‌హోల్స్ సరిగ్గా లేకపోవడంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రజలకు ఇబ్బందిగా ఉన్న ఈ పనులను వెంటనే పూర్తి చేయాలని కమిషనర్‌ను కోరామన్నారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు.



కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్రకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు

తాగునీరు, స్ట్రీట్‌లైట్ల సమస్యలపై..

బండ్లగూడ: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్, తాగునీటి ఇబ్బందులు ఎదురు కాకుండా చూడాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు శ్రీనాథ్‌రెడ్డి, ప్రశాంత్‌నాయక్, రవీందర్‌రెడ్డి, అస్లాం, చంద్రశేఖర్, ముద్దం రాములు కోరారు. మంగళవారం కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్రను మర్యాదపూర్వకంగా కలిసి పలు డివిజన్లలో నెలకొన్న తాగునీటి సమస్యలు, స్ట్రీట్‌లైట్ల సమస్యలను తీర్చాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ.. పలు డివిజన్లలో తాగునీటి కటకటలు వేసవీకాలం ప్రారంభంలోనే అధికంగా కనిపిస్తున్నాయన్నారు. ప్రజలకు నీటి ఇబ్బందులు తలెత్తడంతో తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారన్నారు. ఈ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరామన్నారు. నాయకులు ఖాజాపాషా తదితరులున్నారు.

సమస్యలపై మున్సిపల్ కమిషనర్‌తో సమీక్ష



కమిషనర్ శరత్‌చంద్రతో డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు కార్పొరేషన్ కమిషనర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. పలు సమస్యలపై చర్చించి తీసుకోవాల్సిన పరిష్కార చర్యలపై సమీక్షించారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలో తాగునీటి సమస్య, స్ట్రీట్‌లైట్ల సమస్యలను వెంటనే పరిష్కరించేలా చూడాలన్నారు. ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలన్నారు. గోతులమయంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేయించాలన్నారు. రహదారులపై పగిలిన మ్యాన్‌హోల్స్‌లను మార్చి కొత్తవాటిని ఏర్పాటు చేయాలన్నారు. స్ట్రీట్‌లైట్ల కోసం ఉన్నతాధికారులకు వివరించామని పేర్కొన్నారు. తాగునీటి సమస్యలపై జలమండలి అధికారులను కలవాలని సూచించారు. డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు భూపాల్‌గౌడ్, ప్రశాంత్‌నాయక్, చంద్రశేఖర్, అస్లాం, రవీందర్‌రెడ్డి, నాయకులు ప్రేమ్‌కుమార్‌గౌడ్, గోపాల్‌ముదిరాజ్, టిల్లురెడ్డి, ఖాజాపాషా తదితరులున్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ

మణికొండ: బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా నార్సింగి మున్సిపాలిటీ, ఖానాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ రెండోసారి నియమితులయ్యారు.బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఈ విషయాన్ని ప్రకటించి ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ. జిల్లాలో బీజేపీ పార్టీతో పాటు ఓబీసీ విభాగం పటిష్టతకు ఎంతగానో కృషి చేశానని, దాన్ని గుర్తించి మరోసారి ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా అవకాశం



ఇచ్చారన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా మరింత కష్టపడి పార్టీని బలోపేతానికి కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. జిల్లా నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ ఎస్సీ మోర్చా పార్లమెంట్ ఇన్‌చార్జిగా జోగి రవి

రాజేంద్రనగర్: బీజేపీ ఎస్సీ మోర్చా చేవెళ్ల పార్లమెంటు ఇన్‌చార్జిగా జోగి రవిని నియమించినందుకు ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండేటి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యేలు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో పార్లమెంటు అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తానన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ప్రధాని నరేంద్ర మోదీకి ఇచ్చిన మాట ప్రకారం పని చేస్తానన్నారు. పార్లమెంటులో ఉన్న ఎస్సీ ఓటర్లకు మోదీ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, ఎల్లవేళలా ప్రజలు, పార్టీకి అందుబాటులో ఉంటానన్నారు.

సన్మానం



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బాధ్యత నిర్వహిస్తున్న శ్రీనయ్యకు జడ్జిగా పదోన్నతి రావడంతో మంగళవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఖమ్మం జడ్జిగా పదోన్నతి రావడంపై న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

రూ.11 లక్షల విలువైన 30 కేజీల గంజాయి స్వాధీనం

మైలార్‌దేవ్‌పల్లి: గంజాయి తరలిస్తున్న ముఠాను ఎస్‌ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకుని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు అప్పగించారు. ఎస్‌ఓటీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతబస్తీకి చెందిన మహమ్మద్ అయాన్, మహమ్మద్ మొయినుద్దీన్, దీపక్ పటేల్‌లు స్నేహితులు. ముగ్గురు కలిసి గంజాయి వ్యాపారం చేస్తున్నారు. ఈ క్రమంలో ఒడిశాకు చెందిన దీపక్ పాటిల్ భద్రాచలం నుంచి కొనుగోలు చేస్తున్నారు. మంగళవారం హైదరాబాద్‌కు తరలిస్తుండగా.. రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ పోలీసులు మాటు వేసి పట్టుకున్నారు. పోలీసులకు చిక్కకుండా బైక్‌పై చిన్న చిన్న ప్యాకెట్లు చేసి విక్రయిస్తున్నట్లు సమాచారం. ఇద్దరు నిందితులను అరెస్టు చేశామని మరో నిందితుడు దీపక్ పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి రూ.11 లక్షల విలువ చేసే 30 కేజీల గంజాయి, ఓఆటో, బైక్‌తో పాటు 2 మొబైల్ ఫోన్లను సీజ్ చేశామన్నారు. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఊరెళ్లొచ్చేసరికి ఇంట్లో చోరీ

రాజేంద్రనగర్: హోలీ పండుగకు ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులంతా కలిసి సోదరుడి ఇంటికి వెళ్లొచ్చేసరికి ఇంట్లోని బంగారు, వెండి వస్తువులను దుండగులు ఎత్తుకెళ్లిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కిస్మత్‌పూర్ శివసాయినగర్ ప్రాంతానికి చెందిన లోకేష్ (30) కుటుంబసభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. ప్రైవేటు ఉద్యోగైన లోకేష్ సోమవారం హోలీ పండుగ ఉండటంతో నగరంలోని తన సోదరుడి ఇంటికి కుటుంబ సభ్యులందరితో కలిసి వెళ్లాడు. సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో వెళ్లిన లోకేష్ మంగళవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో తిరిగి వచ్చాడు. గేటుకు తాళం తీసి ప్రధాన ద్వారానికి వేసిన తాళాన్ని తీసి డోరు తీసేందుకు ప్రయత్నించగా.. లోపలి నుంచి గడియ పెట్టి ఉంది. దీంతో వెనుక నుంచి వెళ్లి చూడగా... వంటగది తలుపులు తెరిచి ఉన్నాయి. అల్మారాలో దాచిన 20 తులాల బంగారు ఆభరణాలతో పాటు 50 తులాల వెండి ఆభరణాలు కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫింగర్ ప్రింట్స్, డాగ్ స్క్వాడ్ సిబ్బందిని ఘటనా స్థలానికి రప్పించి ఆధారాలను సేకరించారు. స్థానికంగా ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలించగా.. అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు బస్తీలోకి వచ్చినట్లు రికార్డు అయ్యింది. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న బాధితుడు